ప్రజాశక్తి
మంగళవారం 3 జూన్ 2025 5
శ్రీ సత్యసాయి

పెనుకొండ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన రైతులు, రైతు సంఘం నాయకులు

ప 'రేషన్'

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీలో తీసుకొచ్చిన మార్పులు ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇదివరకు ఎండియు వాహనాల ద్వారా ఇళ్ల వద్దకు వచ్చి పంపిణీ చేసేవారు. ఈ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. పాత పద్ధతిలోనే పంపిణీ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల ఒకటవ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. ప్రజలు రేషన్ షాపుల వద్ద బారులు దీరి నిలబడుతున్నారు. సర్వర్ సమస్యలు దీనికి తోడవడంతో రోజుల తరబడి రేషన్ షాపుల వద్ద పడిగాపులు గాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

◆ ఎండియు వాహనాల్లేక అవస్థలు ◆ రేషన్‌షాపుల వద్ద పడిగాపులు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 1645 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,67,308 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా సగటున పదివేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇవే కాకుండా అంగన్వాడీ కేంద్రాలకు కూడా పంపిణీ వీటి ద్వారానే జరుగుతూ వచ్చింది. ప్రతినెల 1వ తేదీ నుంచి 17వ తేదీ మధ్యలో పంపిణీ జరుగుతూ ఉండేది. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 405 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ జరుగుతూ వచ్చేది.

వృద్ధురాలు మృత్యువాత

అనంతపురంలోని ఓ రేషన్ షాపు వద్ద రేషన్ షాపు వద్ద పడిగాపులు గాచి ఓ వృద్ధురాలు ఆదివారం నాడు మరణించింది. అనంతపురం నగరంలో నిర్మలానంద నగర్‌లో లక్ష్మీదేవి అనే వద్దురాలు ఆదివారం ఉదయం నుంచి ఎండలో రేషన్ కోసం వేచి చూస్తే క్రమంలోనే ఆమె స్వస్థత గురైనట్టు స్థానికులు చెప్తున్నారు. ఇదే క్రమంలోనే ఆమె మరణించింది.

కూటమి రాకతో ఎండియు వాహనాలు బంద్

రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయడం ద్వారా వస్తున్న కొత్త సమస్యల్లో బయోమెట్రిక్ పరికరాల సమస్య తీవ్రంగా ఉంది. ఇదివరకు ఎండియు వాహనాల్లో పంపిణీ చేస్తుండడంతో వాహనానికి ఒకటి చొప్పున బయోమెట్రిక్ పరికరం ఉండేది. ఇప్పుడు ఆ వాహనాలు లేకుండా నేరుగా దుకాణాల్లో పంపిణీ చేస్తున్నడంతో దుకాణాలకు అన్నింటికీ ఈ బయోమెట్రిక్ పరికరాలు లేవు. ఒకేసారి అన్ని రేషన్ షాపుల్లో పంపిణీ చేయడానికి సాధ్యపడటం లేదు. ఒక్కో రోజు ఒక్కో షాపులో మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఒకే దుకాణం వద్దకు చేరడంతో పంపిణీలో జాప్యం జరుగుతోంది. చాలా చోట్ల దుకాణాలు కూడా లేకుండా ఉండడంతో ఎప్పుడు వేస్తారో ఎప్పుడు వేయరో కూడా అర్థం కావడం లేదు.

గతంలో ఎండియు వాహనం ద్వారా రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్‌ఫోటో)

ఇళ్లవద్దనే పంపిణీ చేయాలి

రేషన్ పంపిణీ ముందు పద్ధతిలోని ఎండియు వాహనాలు ద్వారా పంపిణీ చేయాలి. దుకాణాల్లో పంపిణీ చేయడం ద్వారా నిరుపేదల రేషన్ కోసం పనులు వదులుకుని రోజంతా వేచి చూసే పరిస్థితులు ఉన్నాయి. పాత విధానంలోనే పంపిణీ చేపడితే ఇబ్బందులు ఉండవు.

రామిరెడ్డి, సిపిఎం అనంతపురం నగర కార్యదర్శి.

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం

ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-పెనుకొండ

బలవంతపు భూసేకరణకు ప్రయత్నిస్తే ప్రతిఘటిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు హరి అధ్యక్షతన హిందూపురం, లేపాక్షి మండలాల పరిధిలోని చలివెందుల, రాచపల్లి, మలుగూరు, మీనకుంటపల్లి, కొండూరు, వడ్డిపల్లి, తిమ్మాగానిపల్లి గ్రామాల రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీగా స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ చేరుకుని అక్కడ ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండా గ్రామసభలు నిర్వహించకుండా 80 శాతం రైతుల ఆమోదం లేకుండా బలవంతంగా భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. పరిశ్రమల పేరుతో గతంలో పరిగి, హిందూపురం ప్రాంతాల్లో వేల ఎకరాలు సేకరించి, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి దశాబ్దాలు గడుస్తున్నా పరిశ్రమలు పెట్టలేదని మండిపడ్డారు. రైతులు ఐక్యంగా పోరాడి బలవంతపు భూసేకరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ సుమారు 1,118 మంది రైతుల నుంచి 2,191 ఎకరాల భూమిని దేని కోసం, ఎవరి కోసం సేకరిస్తున్నారో చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఏడాదికి మూడు పంటలు పండే భూమిని బలవంతపు భూ సేకరణ చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మరోమారు రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వాలు, అధికారులు జోక్యం చేసుకుని బలవంతపు భూసేకరణను ఆపాలని డిమాండ్ చేశారు. రైతులను ఏకం చేసి పోరాటాలకు సన్నద్ధం చేయాల్సి వస్తుందన్నారు. ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ మద్దతు ప్రకటించారు. అనంతరం వారు ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. రైతులు వ్యక్తిగత అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిద్ధారెడ్డి, ఫకృద్దీన్, వేమారెడ్డి, రైతులు రామలింగారెడ్డి, చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మందుబాబుల అడ్డాగా కుంభకర్ణ ప్రాజెక్టు..!

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజల ఆహ్లాదం కోసం పట్టణ శివారులో ఏర్పాటు చేసిన కుంభకర్ణ ప్రాజెక్ట్ ప్రస్తుతం మందు బాబులకు అడ్డాగా మారిందని చెప్పవచ్చు. అనంతపురం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, మడకశిర, గోరంట్ల తదితర ప్రాంతాల నుంచి నిరంతరం పర్యాటకులు తరలివచ్చి కుంభకర్ణ ప్రాజెక్టు వద్ద ఆహ్లాద వాతావరణంలో సేద తీరుతుంటారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంట్ యజమాని ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తూ మందుబాబులకు నిలయంగా మార్చారన్న విమర్శలు ఉన్నాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి తేడా లేకుండా ప్రాజెక్టు వద్ద మందుబాబులకు తాగేందుకు అనుమతి ఇచ్చి మద్యం సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. శని, ఆదివారాల్లో అయితే అధిక సంఖ్యలో మందుబాబులు కుంభకర్ణ ప్రాజెక్ట లోపల కూర్చొని మద్యం తాగుతూ నానా హంగామా చేస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సైతం తరచూ ప్రాజెక్టులో మద్యం తాగుతున్నట్లు సమాచారం. ప్రతిరోజూ వందలాది మంది పెద్దలు, పిల్లలు ప్రాజెక్టు వద్దకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపి వెళ్తుంటారు. అయితే మందుబాబులు ప్రాజెక్టులో కూర్చుని మద్యం తాగుతుండడంతో పర్యాటకులు వచ్చేందుకు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి మందుబాబులు ప్రాజెక్టులో కూర్చుని మద్యం తాగి నానా రచ్చ చేసినట్లు సమాచారం.

కుంభకర్ణ విగ్రహం వద్ద మద్యం తాగుతున్న వ్యక్తులు

చోద్యం చూస్తున్న అధికారులు..

జిల్లా నలుమూలల నుంచి కుంభకర్ణ విగ్రహాన్ని చూడడానికి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. ఇలాంటి ప్రదేశంలో మందుబాబులు యథేచ్ఛగా ఎక్కడపడితే అక్కడ మద్యం తాగుతుండ డంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవన్నీ తెలిసినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు బలంగా వినివిస్తున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పర్యాటక ప్రాంతమైన కుంభకర్ణ ప్రాజెక్టు వద్ద అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని, రెస్టారెంట్‌లో మద్యపాన నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని పట్టణ ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.

రేషన్ షాపు తనిఖీ

లేపాక్షి : లేపాక్షిలోని 14వ రేషన్‌షాపును సోమవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి సందర్శించి స్టాక్, తూకాలను పరిశీలించారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది సకాలంలో రేషన్ సరుకులను పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. ఎంత సరుకు పంపిణీ చేశారు, ఎంత స్టాక్ ఉందో నోటీస్ బోర్డులో తప్పనిసరిగా కనబరచాలన్నారు. కార్డుదారుల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేయరాదని, తూకాల్లో అవకతవకలు లేకుండా పంపిణీ చేయాలన్నారు. సర్వర్ సమస్య ఉంటే సంబంధిత టెక్నీషియన్‌ను సంప్రదించి పరిష్కారం చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఆర్ఐ ప్రమీలమ్మ, గ్రామ రెవెన్యూ అధికారి రాజేష్, రెవెన్యూ సిబ్బంది రామకృష్ణ, రామప్ప పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు మెరగవ్వాలి

అగళి : మండలంలోని అంగన్వాడీ సెంటర్లలో గ్రోత్ పెంచాలని సిడిపిఒ నాగమల్లేశ్వరి అంగన్వాడీ వర్కర్లకు సూచించారు. అగళిలో సోమవారం అంగన్వాడీ వర్కర్స్‌కు సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రోత్ ఎలా పెంచాలి, ఆధార్, ఓషన్ ట్రాకర్, బాల సంజీవిని, యాప్‌లు, తదితర అంశాలపై అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు అవగాహన కల్పించారు. కేంద్రాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరచి ఉంచాలన్నారు. ప్రీస్కూల్ సక్రమంగా జరపాలని, వర్షాకాలం కావడంత ఫుడ్ ఐటమ్స్ సక్రమంగా పెట్టుకోవాలని, అంగన్వాడీ సెంటర్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం : మంత్రి ఎస్.సవిత తన తండ్రి ఎస్.రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఎస్‌ఆర్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా వైద్యం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి మూడేళ్లుగా పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కూడా స్థానిక పిహెచ్‌సిలో గర్భిణులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ మెంబర్ పెట్రోల్ బంక్ మేనేజర్ క్రిష్టప్ప, లింగప్ప, సి.ఉమాశంకర్, పైగేరి రవి, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు పైగేరి సిద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

సోమందేపల్లి : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సోమవారం ఎంఇఒ-2 ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఇఒ మాట్లాడుతూ అన్ని పాఠశాలకు 1 నుంచి పదో తరగతి వరకూ పాఠ్యపుస్తకాలు, 6 నుంచి పదో తరగతి వరకూ పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. రెండు రోజుల్లో బ్యాగులు, దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో అన్ని సౌకర్యాలు ఉంటాయని, ప్రతి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమ నిధికి మంత్రి విరాళం

పెనుకొండ : జిల్లా జర్నలిస్ట్ సంక్షేమ నిధికి రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును సోమవారం పట్టణంలోని తన నివాసంలో మంత్రి ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు సి.పుల్లయ్య, పెనుకొండ పాత్రికేయులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులతో పాటు జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

మడకశిర : గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాలని కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి సూచించారు. రొళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశాన్వి ఇంగ్లీష్ మీడియం ప్రయివేటు పాఠశాలను సోమవారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాల నిర్వాహకులు చిత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిసాతమని, మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జికె.ఈరన్న, నాయకులు రామకృష్ణ, భరత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ

లేపాక్షి : కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 4వ తేదీ హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపికావేణురెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయాలని మండల వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. లేపాక్షిలో సోమవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదైనా సూపర్-6 పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిందన్నారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, కో ఆప్షన్ మంబర్ బషీర్, వైస్ కన్వీనర్ రవీంద్రారెడ్డి, కోశాధికారి మాధవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వైస్ సర్పంచి వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్య నారాయణరెడ్డి, ఆర్డీవో సువర్ణ తదితరులతో కలిసి 226 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే ప్రత్యేక శ్రద్ధతో పనిచేసి పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులు ఇంకా పరిష్కారం కాని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాలుగు లక్షల మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలు వంద శాతం ప్రజలకు చేరాలన్నారు. బుక్కపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, పశు సంవర్ధక శాఖ జెడి శుభదాస్, సిరికల్చర్ జెడి పద్మావతి, ఏపీఎంవైపి పీడీ సుదర్శన్, సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డిఎఫ్ఒ చక్రపాణి, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మహదేవ్, క్రీడల శాఖ అధికారి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

మలేరియాను నిర్మూలిద్దాం

మలేరియా ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. ఆరోగ్య వైద్య కుటుంబ శాఖ ఆధ్వర్యంలో మలేరియా అంతం మనతోనే అనే గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రక్త దాతల దినోత్సవం సందర్భంగా 18 నుంచి 45 ఏళ్ల వయసు కలవారు రక్తదాన కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మా నాయక్, యూనిట్ అధికారులు రమణ, గోపి నాయక్, శివ, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలో పేదలు, ఉపాధి కూలీలు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 8 వారాల నుంచి వేతనాలు, పే స్లిప్‌లు ఇవ్వడం లేదని, మస్టర్లు అందుబాటులో లేవని, కష్టానికి తగ్గ ఫలితం లేదని, పనిముట్లు ఇవ్వలేదన్నారు. మూడేళ్లుగా పేదలు పాలసముద్రం క్రాస్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్నారని, ఆ కాలనీలో నీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గోరంట్ల, పాలసముద్రం, బూదిలి, మల్లాపల్లి, ఎగువ గంగంపల్లి, మందలపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు 500 మంది పేదలు రెండేళ్ల క్రితం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. రేషన్ షాపుల్లో ప్రతి నెలా 15 రోజుల పాటు రెండు పూటలా నిత్యావసరాలు పంపిణీ చేసేలా పర్యవేక్షణ చేయాలని, ఎండియు వాహనాలను కొనసాగించాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు ముత్యాలప్ప, ప్రదీప్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగభూషణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అంజలి, ఆంజనేయులు, నంజుండప్ప పాల్గొన్నారు.

తహశీల్దార్ మారుతికి వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

ఎంజెపి అధ్యాపకులకు దిశా నిర్దేశం

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి సోమవారం ప్రిన్సిపల్ ప్రసాద్ విధుల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. కళాశాల పున్నప్రారంభం సందర్భంగా సోమవారం అధ్యాపకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత విద్యార్థిను లను సత్కరించి అభినందించారన్నారు. ఈ ఏడాది కూడా మరింత అత్యుతమ ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే గుడిబండ ఎంజెపి బాలికల గురుకుల కళాశాలను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. ఎలాంటి అంతరాయం కలుగకుండా తరగతులు నిర్వహించాలని, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మెనూ ప్రకారం నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాలని, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల, కళాశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని సూచిం చారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో సత్సంబంధం కలిగి కళాశాల ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ లలిత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో సమావేశమైన ప్రిన్సిపల్ ప్రసాద్

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్. రాజు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపికి విశేష సేవలందించిన జవహర్‌కు సిఎం చంద్రబాబు అత్యున్నత స్థానం కట్టబెట్టి దళితులపై తనకున్న చిత్తశుద్ధిని మరోమారు చాటుకున్నారన్నారు. జవహర్ దళితులకు విశేషమైన సేవలు అందించాలని కోరారు. రానున్న కాలంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, భావి దళిత యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

రోడ్డును పరిశీలించిన పిఆర్ డిఇ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని మల్లినమడుగు గ్రామంలో రోడ్డును అధికారులు పరిశీలించారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో 'రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీరాజ్ డిఇ వెంకటేశులు సోమవారం ఆ గ్రామం వెళ్లి నీరు నిలిచిన రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితమే 180 మీటర్ల మేర సీసీ రోడ్డు వేశారని, అయితే రోడ్డుకు ఇరువైపులా గ్రామస్తులు ఇళ్లు నిర్మించుకోవడం, వర్షం నీరు ఇళ్లలోకి రాకుండా మట్టి వేయడంతోనే రోడ్డుపై నీరు నిలిచాయే తప్పా రోడ్డు గుంతలు పడలేదన్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
శ్రీ సత్యసాయి జిల్లా: రామగిరి, మడకశిర రూరల్, ధర్మవరం, హిందూపురం రూరల్, కనగానపల్లి, అమరాపురం
ఇంటర్వ్యూ : తేది: 09-06-2025 సోమవారం ఉదయం 10 గంటలకు
శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జరుగును.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,318

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టిడిపి ప్రభుత్వం విఫలమైందని వైసిపి మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఎం మహాలక్ష్మి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నారాయణ విమర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా భావించడం జరిగిందని ఆరోజు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నాయకులు విడుదల చేవ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాల్మీకి శంకర్, ఎంపీటీసీ రమణారెడ్డి, రఫీ, యుగంధర్, వెంకటరాముడు, బేల్దారి ఎల్లప్ప, చంద్రాయుడు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని సాయి బాబా దేవాలయం సిరికల్చర్ కార్యాలయము ముందు జరిగిన ఈ వేడుకల్లో మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, జనసేన నాయకులు చిలకం మధుసూదన్ రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు కుంచపు నారప్ప, తోపుదుర్తి వెంకటరాముడు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాలాంజనేయులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాలాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న నీలకంఠారెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులును ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమించారు.

పాఠశాలల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలంలో "మిషన్ స్కూల్ డెవలప్‌మెంట్ ప్లాన్ అమలుపై సోమవారం ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ సాయి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంఇఒలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు. పాఠశాలల్లో పరిశుభ్రత పెంపొందించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల సహకారం అవసరమన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రతి పంట సాగుకు విత్త శుద్ధి తప్పనిసరి అని వ్యవసాయ శాస్త్రవేత్త మంజునాథ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మేకల చెరువు, ఎన్‌పి. కుంట గ్రామాల రైతులకు పంటసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త మంజునాథ్ మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఆముదం పంట శ్రేయస్కరం అని అన్నారు. కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ మాధవి, డాక్టర్ నజరుద్దీన్ రైతులకు కంది, వేరుశనగ వంటి పంటలలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇళ్ల పట్టాలిచ్చేవరకు పోరాటం : సిపిఎం

ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

నిలువ నీడ లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఎం నాయకులు చెప్పారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ , అర్హులైన నిరుపేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. లబ్ధిదారులందరు వారి చిరునామాకు సంబంధించిన ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు ఇతర పత్రాలను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు, జిఎల్. నరసింహులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతు హిందూపురం పట్టణంలో దాదాపు 15 సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాన్ని కేటాయించ లేకపోయిందన్నారు. పట్టణంలో దాదాపు 18 వేల మంది వరకు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఈనేపథ్యంలో పేదలకు అండగా నిలిచిన సిపిఎం ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలు పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో భూ పోరాటం ద్వారా గుడిసెలను వేసుకున్నారన్నారు. అయితే పేదలకు అండగా నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను ఉసిగొల్పి రాత్రికి రాత్రే గుడిసెలను కూల్చి వందలాది మందిని నిరాశ్రయులుగా మార్చారన్నారు. ఆ సమయంలో న్యాయం కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. పరిశీలన చేసిన న్యాయస్థానం నాలుగు నెలల లోపు పేదలందరికీ ఇళ్లస్థలాలను కేటాయించాలని అధికారులకు సూచించిందన్నారు. అయితే న్యాయం చేయాల్సిన అధికారులు తూ తూ మంత్రంగా సర్వే నిర్వహించి, అన్ని ఆధారాలతో ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వ్యతిరేకంగా వారు నివాసాల్లో లేరని నివేదిక తయారు చేశారని విమర్శించారు. ఈ చర్యలను చూస్తుంటే అర్హులను అన్యాయం చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోందన్నారు. పేదలకు అండగా నిలవాల్సిన అధికారులకు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికే పేదల గుడిసెలను కూల్చినందుకు సబ్ కలెక్టర్ స్థాయి అధికారిని న్యాయస్థానం తహశీల్దార్ గా డి ప్రమోషన్ చేయాలని ప్రభుత్వానికి ఆదేశించడం జరిగిందన్నారు. ఆ తీర్పునైనా అధికారులు అమలు చేసి పేదలకు అండగా నిలిచి గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, వీధి దీపాలు, నీటి సౌకర్యాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి పట్టాలు సాధించే వరకు తమ పోరాటాం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, రామకృష్ణ, ఇళ్లస్థలాల పోరాట కమిటీ నాయకులు జ్యోతమ్మ, సరస్వతి, నాజీయా, నస్రీన్ తాజ్, రాయుడు, సునీత, చంద్రమ్మ, అంజలి, శశికళ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీయమంటే పునాదులు తవ్వేశారు..

పరిటాల శ్రీరామ్‌తో బాధితుల మొర

ఇష్టారాజ్యంగా తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని డ్రయినేజీల్లో పేరుకుపోయిన పూడిక తీయమంటే ఏకంగా రోడ్లు, కాలువలు, వ్యాపార సముదాయాల పునాదులు కూడా తవ్వుతున్నారని ధర్మవరంలోని వ్యాపారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం పట్టణంలో గత పది రోజుల క్రితం వ్యాపార సముదాయాల ముందు డ్రైనేజీలో చేపట్టిన పూడిక తీత పనుల వల్ల తీవ్రంగా నష్టపోయామని పలువురు వ్యాపారులు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సోమవారం ఆ పనులను పరిశీలించారు. ఈపనులు మనుషులతోనే చేయాలని టెండర్ అగ్రిమెంట్లలో ఉండగా అందుకు విరుద్ధంగా పట్టణంలో జేసీబీలతో ఇష్టానుసారం పనులు చేపట్టడం వల్ల భవనాల పునాదులు, రోడ్లు దెబ్బతింటున్నాయని వ్యాపారులు శ్రీరామ్ తో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై శ్రీరామ్ మాట్లాడుతూ ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నా లేదా సిల్టు తీసేందుకు కొంత గడువు ఇచ్చి వ్యాపారులకు తెలియజేయాల్సి ఉందన్నారు. అలా చేయకుండా ఇష్టానుసారం తవ్వడం వలన చాలా నష్టం జరిగిందన్నారు. ఎక్కడికక్కడ పూడిక తీసి రోడ్లపై వేయడం వలన వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే మ్యాన్ హోల్స్ పెట్టించుకోవాలని సూచనలు చేయకుండా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తవ్వకాలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. పనులు ఆలస్యంగా ప్రారంభించి ఇప్పుడు తొందరగా పూర్తి చేయాలంటే ఎలా సాధ్యమవుతుందన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులతో చర్చించి.. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎక్కువ నష్టం లేకుండా పనులు చేయాలని శ్రీరామ్ సూచించారు. ప్రస్తుతం తొలగించిన దెబ్బతిన్న డ్రైనేజీ కాలువలను రోడ్లను మున్సిపాలిటీ వారే నిర్మించాలని బాధిత వ్యాపారస్తులు శ్రీరామ్ ను కోరగా దీనిపై అధికారులతో మాట్లాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

ముగిసిన కరాటే శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఆంధ్రప్రదేశ్ క్రీడా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు మే 1 నుండి 31 వరకు జరిగాయి. మాస్టర్ షాకీర్ అద్వర్యంలో కదిరి లో బాలికల ఉన్నత పాఠశాలలో కరాటేలో విద్యార్థిని విద్యార్థులకు 30 రోజులు పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో శర్మ, జెడ్పిహెచ్ఎస్ హెచ్ఎం వెంకటాచలం హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ అభ్యసించిన కరాటేను వారి ముందు ప్రదర్శించారు. అనంతరం ముఖ్య అతిధులు మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ ను, ప్రశంసా పత్రాలను,కరాటే డ్రెస్‌ను అందజేశారు. కార్యక్రమంలో కరాటేకోచ్ చాందిని,అలిహివసల్లం, విద్యార్థులు,వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

4న యోగాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 4వ తేదీన బుధవారం ఉదయం 7 గంటలకు తిరువీధుల్లో చౌక్ రోడ్డు,శివాలయం రోడ్డు, గోళ్లబావి మండపం రోడ్డు, హిందూపురం క్రాస్ రోడ్డు, తేరు బజార్, శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తిరువీధుల్లో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పురప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న వేరుశనగ బస్తాలు

విత్తన పంపిణీ జరగకనే సబ్సిడీ వేరుశనగ పక్కదారి ..!

ప్రజాశక్తి - తనకల్లు

ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ పంపిణీ కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. అయితే వేరుశనగ పంపిణీ కార్యక్రమం జరుగకముందే మండలంలో బొలేరో వాహనంలో అక్రమంగా సబ్సిడీ వేరుశనగ తరలిపోతుండటంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న విత్తన వేరుశనగను గమనించిన కొందరు రైతులు ప్రశ్నించగా ఇది ప్రభుత్వ విత్తన వేరుశనగ అని దీనిని తనకల్లు లో కొనుగోలు చేసి పలమనేరుకు తరలిస్తున్నామనిఆ వ్యాపారి చెప్పినట్లు రైతులు తెలిపారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి శ్రీహరి నాయక్‌ను వివరణ కోరగా తనకల్లు మండలంలో ఇంతవరకు రిజిస్ట్రేషన్ కూడా జరగలేదన్నారు. విత్తన వేరుశనగ పంపిణీ జరగలేదన్నారు. అయితే అక్కడ అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనంలో ఉన్న వేరుశనగ ఎక్కడివో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు విచారణ చేస్తే అసలు విషయాలు బయట పడతాయని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసు ఛేదింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఏడాది క్రితం జరిగిన హత్యకు సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ మహిళ ప్రియుడితో భర్తను హత్య చేయించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. 2024 సంవత్సరంలో జరిగిన ఈ హత్య కేసును ధర్మవరం రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో హత్య చేసిన నిందితులను కనుగొని వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. రొద్దం మండలం ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన సిద్ధప్ప, పరిగి మండలం ఊటకూరు గ్రామానికి చెందిన నూర్ మొహమ్మద్, కర్నాటక లోని తుముకూరు జిల్లా పావగడ తాలూకా హుస్సేనపురం గ్రామానికి చెందిన మొద్దుల మోహన్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. రొద్దం మండలం ఆర్ ఎల్ కొత్తూరు గ్రామానికి చెందిన మోహన్, ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన మృతుడు మంజునాథ్ భార్య యమునా పరారీలో ఉన్నారని తెలిపారు. పోతుకుంట గ్రామానికి చెందిన అల్లే మంజునాథ్ 12 సంవత్సరాల క్రితం భార్య యమున, కుమారుడు, కుమార్తెతో కలసి పెనుగొండలో నివాసం ఉంటూ కుటుంబపోషణ కోసం డ్రైవర్ గా పని చేస్తుండేవాడు. మంజునాథ్ త్రాగుడుకు అలవాటు పడి భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మంజునాథ్ భార్య యమునకు రొద్దం మండలం ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన సిద్ధప్పతో 2023లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. తన వివాహేతర సంబంధానికి భర్త మంజునాథ్ అడ్డుగా ఉన్నాడని భావించిన యమున తన భర్తను ఎలాగైనా చంపాలని ప్రియుడిపై ఒత్తిడి చేసింది. దీంతో సిద్ధప్ప తన స్నేహితులైన నూర్ మహమ్మద్,మదన్ మోహన్‌తో కలసి 2024 ఏప్రిల్ 22వ తేదీన మంజునాథ్‌ను నాగలూరు గ్రామం నడిమి వంక లోకి పిలుచుకుని వెళ్లారు. ఈసందర్భంగా అతిగా మద్యంతాగించి మెడకు టవల్ బిగించి మంజునాథ్ ను హత్య చేశారు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసును ఛేదించారు. కేసు చేధనలో ప్రతిభ కనపర్చిన ధర్మవరం రూరల్ సర్కిల్ సిఐ ఎన్.ప్రభాకర్ ధర్మవరం ఎస్ఐ.పి. శ్రీనివాసులు,హెడ్ కానిస్టేబుల్ శత్రు నాయక్, అనిల్ కుమార్, బాలకృష్ణను ఈసందర్భంగా జిల్లా ఎస్పీ ప్రశంసించారు. ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేసే అభినందించారు. ఈ సమావేశంలో ఎస్పీతోపాటు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ఎస్బిసిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ లో ఆదివారం జరిగిన దాడి కేసులో నిందితుడు క్రిష్టప్పను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ మొరంపల్లికి చెందిన క్రిష్టప్ప పాత కక్షలతో అరుణ్ కుమార్ పై ఆదివారం కొడికొండ చెక్ పోస్ట్ లో కొడవలితో దాడి చేశాడన్నారు. ఈ కేసులో క్రిష్టప్పను అరెస్టు చేసి సోమవారం న్యాయ స్థానంలో హాజరు పర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

విదేశీయుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో అనుమానాస్పద స్థితిలో ఓ విదేశీయుడు మృతి చెందిన సంఘటన కలకలం రేపుతోంది. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఈస్ట్ యూరప్ బెలారస్‌కు చెందిన డేవిడ్ విచ్ పట్టణంలోని గోపురం సెకండ్ క్లాస్ ప్రియాంక గెస్ట్ హౌస్ లోని 5 అంతస్తులో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఐదవ అంతస్తు నుంచి క్రింద పడి మృతి చెందాడని స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విదేశీయుడు మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదవశాత్తు క్రింద పడి చనిపోయాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విదేశీయుడు ఒంటి మీద బట్టలు లేకుండా పైనుంచి క్రింద పడి మృతి చెందడంతో అపార్ట్ మెంట్ వాసుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సుంది.

ఈదురుగాలులకు నేలకొరిగిన మర్రిచెట్టు

ప్రజాశక్తి-పావగడ

ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షానికి పట్టణంలోని కుమార స్వామి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న భారీ మర్రి చెట్టు నేలకూలింది. చెట్టు కొమ్మలు పడడంతో ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కల్లుబాయి తండాలో తాగినీటి సమస్య

ప్రజాశక్తి - గాండపెంట

మండల పరిధిలోని కల్లుబాయి తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆగ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దాదాపు రెండు నెలల నుంచి తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్రామానికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవటంలో నానా పాట్లు పడుతున్నామన్నారు.సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా వారు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీడీవో వెంకటరామిరెడ్డి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు దీంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణానాయక్, శ్రీనివాసులు నాయక్‌తో పాటు అధికసంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కదిరి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

హిందూపురం : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి, తహశీల్దార్ వెంకటేశుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, తజాముల్, అల్తామాష్, ఆదర్శ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం

ప్రజాశక్తి - నల్లమాడ

కదిరి మండలంలోని కుమ్మరి వాండ్లపల్లి లో ఉన్న పెట్రోల్ బంకులో పని చేస్తున్న బాబా ఫక్రుద్దీన్‌ను స్తంభానికి కట్టేసి కొట్టడం అన్యాయమని సిపిఎం మండల నాయకులు గోవిందు, మల్లికార్జున, రామయ్య అన్నారు. ఈఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు స్పందించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, వైసిపి నాయకులకు లేదని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న ప్రజా కంటక పాలనకు చరమగీతం పాడి కూటమికి అధికారం ఇస్తూ చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని అన్నారు. దీనిని వెన్నుపోటు దినమని ధర్నా నిర్వహిస్తే ప్రజాస్వామ్యాన్ని వైసిపి నేతలు అపహాస్యం చేసినట్లేనని చెప్పారు. ఎన్నికల్లో స్వార్థం కోసం తల్లి చెల్లిని వినియోగించుకున్న వైఎస్ జగన్ తర్వాత వారిని విస్మరించారని విమర్శించారు. వివేక కుమార్తెకు న్యాయం చేసి వెన్నుపోటు గురించి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మాజీ పట్టణ అధ్యక్షులు అహ్మద్ అలీ,వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని చిన్న,సన్నకారు రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు ఈ నెల 20 తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎపిఒ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 180 ఎకరాలకు ఉద్యాన పంటలు సాగు చేయుటకు ప్రభుత్వం నుండి అనుమతి ఉందన్నారు. ఐదు ఎకరాల లోపు విస్తీర్ణం కలిగిన రైతులు, సన్న కారు, చిన్న కారు రైతు ధ్రువీకరణ పత్రం, జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు. మామిడి, నిమ్మ, జామ సపోటా, కొబ్బరి, రోజా పూలు, సన్నజాజి పూలు పెంపకం తదితర పంటలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ కోరారు. వార్డు పర్యటనలో భాగంగా సోమవారం మున్సిపల్ పరిధిలోని హస్నాబాద్‌లో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్యతో కలసి మున్సిపల్ ఛైర్మన్ పర్యటించారు. వార్డు పరిధిలో రహదారులు, మురికి కాలువలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నీటి సమస్యల గురించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆసిఫ్, టీడీపీ నాయకులు జహూర్, వలి, ముబారక్, కో ఆప్షన్ మెంబర్ రహమత్, ఎమ్.హెచ్.ఓ. శోభన్ రెడ్డి, ఎసిపి చంద్రమ్మ, ఏఈ. జనార్ధన్, శానిటరీ ఇన్స్ పెక్టర్ లు శంకర్, నిజాముద్దీన్, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లస్థలాలివ్వాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటిస్థలం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర నాయకులు జాన్సన్ బాబు, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లస్థలాలివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల సొంతింటి కల నెరవేర లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో, రెండు సెంట్లు స్థలం కేటాయించి గృహ నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వమే పక్కాగృహం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రం శెట్టి రమణ, పూలశెట్టి రవికుమార్, గోవిందరాజు, అన్నం లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతుల తమ పేర్లను మండలం లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహ్మద్ తెలిపారు. కె-6, టిసిజియస్ -1694 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2790లు కాగా,40 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటాగా రూ.1674లు చెల్లించాల్సుంటుందన్నారు. అర ఎకరం వరకు 30 కేజీల వేరుశనగ బ్యాగ్,అర ఎకరం నుంచి ఎకరం వరకూ 2 బ్యాగులు, ఒక ఎకరం నుంచి ఆ పైన భూమి వున్న రైతులకు 3 బ్యాగులు గరిష్టంగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందూపురం : హిందూపురం మండలంలోని రైతులు విత్తన వేరుశెనగ కాయల కోసం మంగళవారం నుండి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.సురేంద్ర నాయక్ తెలియజేశారు. ఈ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి హిందూపురం మండలానికి కె-6 రకం 545 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నల్లచెరువు : సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. ధర్మవరంలోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నేతత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి జూన్ 4వ తేదీకి ఏడాది అవుతోందని ఒక్క ఎన్నికల హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా, అడ్డంగా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. 1995లో సొంత మామనే వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తరువాత 1999, 2014, 2024లోనూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఈ సందర్భంగా వైసిపి ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలిరెడ్డి, మూసపల్లి సాయి, గడ్డం కుళ్లాయప్ప నారాయణ రెడ్డి, చౌడప్ప, అమర్ నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు